క్లుప్తంగా

నవధాన్యాల కిట్ల పంపిణీ



చాటాయివలసలో కిట్లు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి : మండలంలోని గుళ్లపాడు క్లస్టర్ పరిధి చాటాయివలసలో రైతులకు నవధాన్యాల కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ రేఖ, ఎల్ -2లు గౌరీశ్వరరావు, సురేష్ మాట్లాడుతూ, రైతులకు రాయితీపై 70 ఎకరాకలు సరిపడా కిట్లు అందజేశామన్నారు. వర్షాలు కురిసిన అనంతరం వీటిని పంట పొలాల్లో వేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు పొగిరి అప్పలనాయుడు, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కె.రమణ, పి.గోవిందమ్మ, శ్రీదేవి, వీఏఏ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసలో ఆరోగ్య సురక్ష శిబిరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనూషా, కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం : మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస గ్రామంలో బుధవారం ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి, అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనూషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలో తిరగొద్దు..



డాక్టర్ కరణం హరిబాబు

రాజాం : వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఎండలో తిరగరాదని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు సూచించారు. ఆస్పత్రి ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలన్నారు. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మద్యం అలవాటు ఉన్న వారు వ్యసనానికి దూరంగా ఉండాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు దూర ప్రయాణాలు మానుకోవాలని హితవు పలికారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



మాధవబజార్ రోడ్డులో చెత్త తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

రాజాం : పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పలు వార్డుల్లో చేపడుతున్న పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల్లోపు చెత్త తరలింపు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

మల్లికార్జునకాలనీలో కార్డన్ సెర్చ్



వాహన పత్రాలను పరిశీలిస్తున్న సీఐ, తదితరులు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని మల్లికార్జునకాలనీలో పోలీసులు బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టౌన్ సీఐ డి.మోహనరావు ఆధ్వర్యంలో రాజాం, రేగిడి పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. కాలనీలోని అన్ని వీధుల్లో కలియతిరిగి వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీలో ఎటువంటి పత్రాల్లేని 43 వాహనాలు సీజ్ చేశామని సీఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అనుమానితులు కనబడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రేగిడి ఎస్సై ఇ.శ్రీనివాస్, ఏఎస్సైలు ఎ.లక్ష్మున్నాయుడు, ఎస్.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వంగర: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మాన్ రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

భానుడు భగ భగ..



వంగర: అరసాడలో జనసంచారం లేని వీధి



సంతకవిటి: వాహన రాకపోకలు లేక నిర్మానుష్యంగా మారిన పోతుల జగ్గుపేట - లాభాం వారధి

ఎండలు మండుతున్నాయి.. సూరీడు ఉదయం ఏడు గంటల నుంచే ప్రతాపం చూపిస్తున్నాడు.. విపరీతమైన వేడి, ఉక్కబోతతో ప్రజలెవ్వరూ ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. దీంతో ప్రధాన జంక్షన్లు, రోడ్లు నిర్మానుష్యంగా కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.. రోహిణీ కార్తె కావడంతో విపరీతమైన ఎండలు కాస్తున్నాయని పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. – వంగర/సంతకవిటి

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు



బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు డి. శంకరరావు, గ్రంథాలయ నిర్వాహకురాలు సత్యవాణి

రామభద్రపురం: గ్రంథాలయాలలో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ప్రత్యేకంగా పిల్లల కోసం విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవుల్లో ఆటపాటలతో గడిపే చిన్నారులకు ఆయా నిర్వాహకులు చదువుతో పాటు వివిధ రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక గ్రంథాలయ శాఖాధికారి సత్యవాణి చిన్నారులకు తెలుగు పద్యాలు, చందమామ కథలు, శతక పద్యాలు, ఆట పాటలు నేర్పించడంతో పాటు ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సబ్జెక్ట్ టీచర్లను రప్పించి గణిత సూత్రాలు, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్ తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా నేర్పిస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన పైడితల్లి పండుగ

బాడంగి: మండలంలోని డొంకినవలస పైడితల్లి పండుగ బుధవారం నాటి అంపకోత్సవంతో ప్రశాంతంగా ముగిసింది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు పండుగ నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున అమ్మవారు పూనును మేళతాళాలతో ఊరేగించగా.. భక్తులు పసుపు, కుంకుమలతో గ్రామ శివారులోగల అమ్మవారి గుడికి తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఆర్.జయంతి బందోబస్తు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

రేగిడి: మండల కేంద్రంలో గల సబ్‌స్టేషన్ పరిధిలోని ఉంగరాడమెట్ట, రేగిడి, ఆమదాలవలసతో పాటు మండల కార్యాలయాలకు శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖ ఏఈ లావేటి హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తలైన్ పనులు వేయనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరిశీలన

రాజాం : పట్టణంలోని వరలక్ష్మీ సెయింట్ ఆన్స్, ది సన్ స్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను ఎంఈఓ యాగాటి దుర్గారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పరీక్ష జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మండలానికి చేరుకున్న కట్టెజనుము విత్తనాలు

రేగిడి : భూసారం పెంపొందించేందుకు అవసరమైన కట్టె జనుము విత్తనాలు ఆర్బీకేలకు చేరుకున్నాయని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని చాటాయివలస, ఉంగరాడ, గుళ్లపాడు ఆర్బీకేలకు వెయ్యి కిలోల చొప్పున విత్తనాలు అందించామన్నారు. వీటిని ఆయా కేంద్రాల్లో భద్రపరిచామని, రైతులకు త్వరలో అందిస్తామని తెలిపారు.

షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



షిర్డీ సాయికి పూజలు చేస్తున్న తలే రాజేష్, జగన్ మోహనరావు, తదితరులు

సంతకవిటి: మండలంలోని మందరాడ షిర్డీసాయి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పులఖండం శ్రీనివాసరావు శర్మ, పులఖండం శ్రీకాంత్ శర్మ, రేజేటి శ్రీనివాస శర్మ, రేజేటి శ్రీరామ శర్మ, వేమకోటి సతీష్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మారేడుబాక కళాకారులచే ఏర్పాటు చేసిన కోలాట నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్ మోహనరావు పూజల్లో పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల పరిస్థితిపై సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

బాడంగి: మండలంలోని నివాసిత కుటుంబాల వారికి గతంలో రాయితీపై వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామని, అయితే నిర్మాణం చేపట్టి ఐదారేళ్లు గడిచిపోతున్న నేపథ్యంలో వాటి ప్రస్తుత పరిస్థితిపై సర్వే చేపట్టాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో మొత్తంగా 12,500 పైచిలుకు కుటుంబాలుండగా.. సుమారు 7,780 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామన్నారు. అయితే వాటి పరిస్థితిపై సర్వే చేసి తాజా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఇంజినీరింగ్ సహాయకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సరదాల మాటున ప్రమాదం..

- వేసవి సెలవుల్లో పిల్లలను ఓ కంట కనిబెట్టాలి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు



క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

రామభద్రపురం: వేసవి తాపం తీవ్రంగా ఉంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎక్కడ చూసినా వడగాడ్పులు వీస్తున్నాయి. వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చిన్నారులు సందడి కనిపిస్తోంది. ఎవరికి ఇష్టం వచ్చిన ఆటలు వారు ఆడుతూ సరదాగా గడిపేస్తున్నారు. అయితే ఈ సరదాల వెనుక ప్రమాదాలు దాగుంటాయని పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉండాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. అలవాట్లు, ఆహారం, ఆరోగ్యం, చదువు తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా రూపొందించుకుంటే వారి మేధస్సుకు పదును పెట్టిన వారమవుతామని సూచిస్తున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఖాళీగా ఉండడం ఇష్టం లేక వీలైనంత వరకు తోటి స్నేహితులతో సరదాగా గడపాలని చూస్తారు. ఆటపాటల్లో గడిపేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. ఆటలు, ఈత శారీరక వ్యాయామంగా మంచిదే అయినప్పటికీ ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి.

బోర్ ఫీలవ్వకుండా...

ఇంట్లో ఖాళీగా ఉంటే పిల్లలు బోర్‌గా ఫీలయ్యే అవకాశం ఉంటుంది. వారికి కొత్త ఆటలు నేర్పించాలి. విజ్ఞానాన్ని పెంచే అంశాలపై దృష్టి సారించేలా చూడాలి. ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు.. సాయంత్రం ఎండ తగ్గిన తర్వాత ఆడుకునేలా చూడాలి. ఇండోర్ ఆటలు ఆడుకునేలా వసతులు కల్పించాలి. ఎండల్లో ఎక్కువగా తిరిగితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది.

వాహనాలతో జాగ్రత్త...

చిన్నతనం నుంచే పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపాలి. సముద్రాలు, నదులు, కాలువల్లో కొట్టకుపోకుండా, తనంతట తానే బయటపడే విధంగా ఈత నేర్పాలి. అలాగే సైకిల్, ద్విచక్రవాహనాలు నేర్చుకోవాలన్న కోరిక పిల్లల్లో సహజంగానే ఉంటుంది. వయస్సు ఆధారంగా సైకిల్ మాత్రమే నేర్పించాలి. కొంత మంది పిల్లలు ఇంట్లో చెప్పకుండా మోటారు సైకిళ్లు తీసుకువెళ్తుంటారు. బైకుల తాళాలు వారికి అందుబాటులో ఉంచకూడదు.



క్రికెట్ ఆడుతున్న పిల్లలు



సైకిల్ తొక్కుతున్న విద్యార్థులు

ఆటల్లో తర్ఫీదు ఇప్పించాలి..



పిల్లలకు చదువు ఒక్కటే కాదు. ఆటలు కూడా ముఖ్యమే. ఇందుకోసం వేసవి శిక్షణ కేంద్రాలున్నాయి. వాటిని వినియోగించుకోవాలని. అయితే పిల్లలను ఓ కంట కనిబెట్టకపోతే ప్రమాదకరమైన ఆటలాడి ప్రాణాల మీదకు తెచ్చుకునే అవకాశం ఉంది. వీలైనంతవరకు ఇండోర్ గేమ్స్ ఆటుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వాలి.

– బి. రత్నకిషోర్, పీడీ, ఉన్నత పాఠశాల, కొట్టక్కి

ఆరోగ్యంపై ఉష్ణోగ్రతల ప్రభావం..



వేసవిలో సాధ్యమైనంత వరకు పిల్లలు మధ్యాహ్నం పూట ఎండలో తిరగకుండా చూడాలి. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. శీతల పానీయాలు కంటే కొబ్బరిబొండాం, తాజా పండ్ల రసాలు తీసుకోవడం మేలు. వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ తాగించి దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలి.

– సీహెచ్ మాధురి, ప్రభుత్వ వైద్యాధికారి

వైఎస్సార్‌సీపీదే గెలుపు..



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రేగిడి: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీయే అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ఆకాంక్షించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ, అన్నివర్గాల ప్రజలు మళ్లీ జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలనే ఉద్దేశంతో ఓట్లు వేశారని వివరించారు. ఈ కారణంగానే పోలింగ్‌శాతం పెరిగిందని తెలిపారు. కూటమి పగటి కలలు కంటోందని... ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వివాదాలు సృష్టించేందుకు బెట్టింగ్‌ల సంస్కృతికి తెర తీస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



తవిటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు ఎర్నేన అప్పలనాయుడును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. అప్పలనాయుడు తల్లి ఎర్నేన తవిటమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. పరామర్శలో సర్పంచ్ కెంబూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్ మోహనరావు, సర్పంచ్‌లు కరణం గోవిందరావు, గార రమణ, ఉపసర్పంచ్ బాలి తవిటినాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సవళాపురపు నర్సింఅప్పారావు, పాలవలస ధవళేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి



తెర్లాం గ్రంథాలయంలో మాట్లాడుతున్న హైస్కూల్ హెచ్‌ఎం రమేష్

తెర్లాం: రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమేష్ అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండి, లైసెన్స్ ఉన్న తర్వాతే వాహనాలు నడపాలని సూచించారు. మితిమీరిన వేగం వల్ల కలిగే అనర్థాలను వివరించరు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు రికవరీ చేయాలి

వంగర: మహిళా సంఘాలకు సమకూర్చిన వివిధ రకాల రుణాలను రికవరీ చేయాలని ఏపీఎంలు మీసాల చక్రపాణి, టి. మంగమ్మ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులకు మంజూరు చేసిన స్త్రీనిధి, పీఓపీ, హెచ్‌డీఎఫ్, సీఐఎఫ్ రుణాలను త్వరితగతిన వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో బొబ్బిలి నాయకులకు చోటు



వెంకటనాయుడు,బలరాం నాయుడు

బొబ్బిలి: ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో బొబ్బిలికి చెందిన మండక బలరాం నాయుడు, దాసరి వెంకటనాయుడు చోటు దక్కించుకున్నట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీర సన్యాసినాయుడు, బి.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడలో బుధవారం జరిగిన సాధారణ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా వీరిని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. దీంతో బలరాంనాయుడు, వెంకటనాయుడులను మండల కార్యవర్గ ప్రతినిధులు చప్ప వెంకటరమణ, గంట సత్యనారాయణ, సీహెచ్ రామారావు, మరడాన పోలినాయుడు, తదితరులు అభినందించారు.

ఘనంగా బంగారమ్మ తల్లి ఉత్సవాలు



ఘటాల ఊరేగింపు

బొబ్బిలి: మండలంలోని గొంగాడవలసలో బంగారమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో అమ్మవారికి ఘటాలు, పసుపు, కుంకుమలు చెల్లించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం జరిగిన అనుపోత్సవంతో పండగ ముగిసిందని ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- న్యాయమూర్తి అరుణశ్రీ



మాట్లాడుతున్న న్యాయమూర్తి అరుణశ్రీ

బొబ్బిలి: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. అరుణశ్రీ అన్నారు. బుధవారం ఆమె స్థానిక సబ్ జైల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఇచ్చే ఆహారం, ఇతర సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. న్యాయ సహాయం ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో సబ్ జైలర్ పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారి తిరువీధిలో కలశాలతో మహిళలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి కొండంపేట గ్రామంలో గల అయ్యప్పస్వామి దేవాలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఆరవెల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవతో పాటు పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణ, గోపూజ, నవగ్రహ, క్షేత్రపాలక, వాస్తు, యోగిని మండల మంటప ఆవాహనాలు, అర్చనలు, త్రిపూర్వక సూర్యనమస్కారాలు, మహన్యాసపూర్వక మహాలింగార్చనలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 4 వేల మందికి అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు వాకముళ్ల చిన్నారావు, యాలాల వెంకటేష్, ఆర్నెపల్లి వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.